



DD9 వాస్తవాలు పలుకు

# వార్త

తెలుగు దినపత్రిక

## బుకింగ్స్ ఓపెన్ చేసిన గ్లోబల్ స్టార్.. అమెరికాలో 'పెద్ది' సందడి..


04

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 01 | 11-05-2026 సోమవారం | పేజీలు: 08 | వెల: 3/-





# దేశ ఆర్థికాభివృద్ధికి సైబరాబాద్ కీలకం

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకారం
రూ.9,377 కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించిన ప్రధాని మోదీ
హైదరాబాద్‌లో వర్చువల్‌గా
పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
జహీరాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి శ్రీకారం
వరంగల్‌లో పీఎం మిత్ర మెగా
టెక్స్‌టైల్ పార్కుతో భారీ ఉద్యోగావకాశాలు
జాతీయ రహదారి 167 విస్తరణతో రవాణాకు కొత్త ఊపు
కాజీపేట-విజయవాడ మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టుకు ప్రారంభం
హైదరాబాద్ సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ పీవోఎల్ ప్రాజెక్టు అందుబాటులోకి
విద్యుత్, ఈవీ, సైబర్ టెక్నాలజీ రంగాల్లో
తెలంగాణ వేగంగా ఎదుగుతోందన్న మోదీ
తెలంగాణకు కేంద్రం లక్షల కోట్లతో
మౌలిక వసతుల అభివృద్ధి చేస్తోందని వెల్లడి
అభివృద్ధి, ఉపాధి, పారిశ్రామిక రంగాల్లో
తెలంగాణకు కొత్త దశ ప్రారంభమన్న ప్రధాని

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ముఖ్యంగా సైబరాబాద్ దేశంలోనే అతిపెద్ద ఉపాధి కేంద్రంగా ఎదిగిందని, సైబర్ టెక్నాలజీ, విద్యుత్, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో రాష్ట్రం వేగంగా పురోగమిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా రూ.9,377 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, మౌలిక వసతుల విస్తరణపై ఆయన విశేషంగా మాట్లాడారు. దేశాన్ని 'వికసిత్ భారత్ 2047' లక్ష్యంతో అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ప్రధాని తెలిపారు. ఇందులో తెలంగాణ వంటి రాష్ట్రాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పారిశ్రామికీకరణ, ..మిగతా 2లో

# పెద్ద మనసుతో సహకరించండి

తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోదీ సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి వినతి
గుజరాత్ మోడల్ నిర్మాణంలో మన్మోహన్ సింగ్ సహకరించినట్టే తనకు మద్దతివ్వాలని విజ్ఞప్తి
2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతామని హామీ
రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా సమీక్షించాలని మనవి



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ అభివృద్ధికి, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా హెచ్ఐసీసీలో జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి హిందీలో ప్రసంగించి అందరి దృష్టిని ఆకర్షించారు. దేశాభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేస్తామని స్పష్టం చేస్తూనే, తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను ప్రధాని ముందుంచారు.కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడూ ..మిగతా 2లో

# తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

తెలంగాణ కీలక ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి
మోడీకి టీపీసీసీ చీఫ్ లేఖ.. మెట్రో, మూసీ ప్రాజెక్టులకు నిధుల విజ్ఞప్తి
తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రధాని మోడీకి లేఖ
రాష్ట్ర ప్రగతికి కీలక ప్రాజెక్టులపై కేంద్ర చొరవ కోరిన కాంగ్రెస్ నేత
హైదరాబాద్ మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర సహకారం అవసరం


02



# భయపడటానికి ఫామ్‌హౌస్‌లో ఎలుకను కాదు..

పరేడ్ గ్రౌండ్ సభలో బండి సంజయ్ ఫైర్.. కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు
'జై శ్రీరామ్‌తోనే బెంగాల్‌లో బీజేపీ గెలిచింది'.
తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుంది
సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించం
'జై శ్రీరామ్'పై కాంగ్రెస్ హేళన.. బీజేపీ కౌంటర్ అటాక్
సికింద్రాబాద్ సభలో బీజేపీ శక్తి ప్రదర్శన
కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై మండిపడ్డ బండి సంజయ్

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

జై శ్రీరామ్' అనే నినాదం వింటేనే కాంగ్రెస్ నేతలు భయపడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ (Bandi Sanjay) అన్నారు. ఇవాళ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'జై శ్రీరామ్' అంటే ..మిగతా 2లో

# తమిళనాడు సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకారం

తొలిరోజే మూడు సంచలన నిర్ణయాలు
చెన్నై నెహ్రూ స్టేడియంలో అట్టహాసంగా వేడుక
దశాబ్దాల ద్రవిడ పార్టీల ఆధిపత్యానికి తెర
'ఉచిత విద్యుత్' పథకానికి అధికారికంగా ఆమోదం
మహిళల రక్షణ కోసం ప్రత్యేక నిఘా విభాగం
డ్రగ్స్ అంతం చేసేందుకు ఈగల్ తరహా ప్రత్యేక బృందాలు
మంత్రులుగా ప్రమాణం చేసిన 9 మంది సభ్యులు
జాబితాలో సెంగోట్టియన్, కీర్తన వంటి కీలక నేతలు.
గత ప్రభుత్వ వైఫల్యాలపై 'శ్వేతపత్రం' విడుదల చేస్తామ వెల్లడి.
ప్రభుత్వంలో తానే ఏకైక అధికార కేంద్రమన్న సీఎం
బంధుప్రీతికి తావుండదని విజయ్ స్పష్టమైన సంకేతాలు

**చెన్నై, (ప్రజాక్షేత్రం):**



తమిళనాడు రాజకీయ చరిత్రలో ఒక నూతన శకం ఆరంభమైంది. ఆ రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా టీవీకే (తమిళగ వెట్రి కళగం) పార్టీ అధినేత జోసెఫ్ విజయ్ ఆదివారం అట్టహాసంగా బాధ్యతలు చేపట్టారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ చారిత్రక ఘట్టంలో రాష్ట్ర గవర్నర్ ఆర్లేకర్ ఆయనతో పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. 1967 సంవత్సరం తర్వాత తమిళనాడును దశాబ్దాల పాటు శాసించిన డీఎంకే, అన్నాడీఎంకే పార్టీల ఆధిపత్యాన్ని బద్దలు కొడుతూ మరో పార్టీ అధికారంలోకి ..మిగతా 2లో

# ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి?

తెలంగాణ అభివృద్ధికి 12 లక్షల కోట్లు ఇచ్చాం
5 వందేభారత్ రైళ్లు, 42 స్టేషన్ల అభివృద్ధి కేంద్రం కృషేనని వ్యాఖ్య
రాష్ట్ర ప్రభుత్వం మత రాజకీయాలు చేస్తోందని కాంగ్రెస్‌పై ఆరోపణలు
ముస్లింల కోసమే రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శ
గాంధీ కుటుంబం చేతిలో తెలంగాణ బందీ అయిందన్న కేంద్ర మంత్రి
దేశంలోని 21 రాష్ట్రాల్లో బీజేపీ కూటమి అధికారంలో ఉందని ధీమా
తెలంగాణ విముక్తి 'మోదీ గ్యారంటీ'తోనే సాధ్యమని స్పష్టం



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ అభివృద్ధి విషయంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ముఖ్యంగా ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన బీజేపీ భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రజలకు ..మిగతా 2లో

# రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా రేవంత్ రెడ్డికి కనికరం లేదు

వడ్ల కొనుగోళ్లలో రేవంత్ ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్
కొనుగోలు కేంద్రాల్లో రైతుల కన్నీళ్లు.. సీఎం స్పందించాలి
'ఢిల్లీ టూర్లు తప్ప రైతుల కష్టాలు కనిపించవా?'.. రేవంత్‌పై హరీశ్ ఫైర్
రాష్ట్ర రైతుల పరిస్థితి దయనీయంగా మారింది
వడ్ల కొనుగోళ్లపై కలెక్టర్ల సమావేశం కూడా పెట్టలేదా?
కర్ణాల్పల్లి కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడిన హరీశ్ రావు
70 లక్షల రైతుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా
రైతుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

రేవంత్ రెడ్డి ప్రభుత్వం వడ్ల కొనుగోలు విషయంలో దారుణంగా ఫెయిల్ అయ్యిందని రాష్ట్రంలో రైతుల పరిస్థితి చాలా దయనీయంగా మారిందని మాజీ మంత్రి హరీశ్ రావు (Harish Rao) విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ గ్రామానికి పోయినా కొనుగోలు కేంద్రాల్లో రైతులు ..మిగతా 2లో

## పెద్ద మనసుతో సహకరించండి

**మొదటిపేజీ తరువాయి**



మోదీ చాలా పెద్ద మనసున్న వారని చెబుతుంటారు, ఆ పెద్ద మనసుతో తెలంగాణ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని మోదీని రేవంత్ కోరారు. దేశ ప్రగతికి సంబంధించిన విషయాల్లో రాజకీయాలు చేయబోమని, వికసిత్ భారత్ నిర్మాణంలో తెలంగాణను భాగస్వామిని చేస్తామని ఆయన ప్రధానికి హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమం కేవలం కేంద్ర ప్రభుత్వానిది కాదని, ఇది తెలంగాణ అభివృద్ధి ఉత్సవమని రేవంత్ రెడ్డి అన్నారు. "ప్రధాని మోదీ వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని ప్రకటించిన రోజే, దానికి అనుగుణంగా మేం 'తెలంగాణ రైజింగ్ 2047' పాలసీ డాక్యుమెంట్‌ను విడుదల చేశాం. దేశాన్ని 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న మీ కలను సాకారం చేయడంలో తెలంగాణ 10% వాటాను అందిస్తుంది. దేశ జనాభాలో 3% కంటే తక్కువ ఉన్నప్పటికీ, దేశ జీడీపీలో 5% వాటాను తెలంగాణ అందిస్తోంది. రానున్న రోజుల్లో దీన్ని 10 శాతానికి పెంచడమే మా లక్ష్యం" అని వివరించారు.

ఈ లక్ష్య సాధన కోసం ఒక ఆసక్తికరమైన పోలికను ప్రధాని ముందుంచారు. "గతంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు, మీరు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆనాడు మీ 'గుజరాత్ మోడల్'కు ఆయన సహకరించారు. ఇప్పుడు మీరు ప్రధానిగా ఉండగా, నేను ముఖ్యమంత్రిగా ఉన్నాను. రాష్ట్ర ప్రజలు నాపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రానున్న పదేళ్లలో 'తెలంగాణ మోడల్' నిర్మించి, 2034 నాటికి రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి మీ ఆశీస్సులు, సహకారం ఎంతో అవసరం" అని రేవంత్ విజ్ఞప్తి చేశారు.

దేశానికి ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ నగరాలు గ్రోత్ ఇంజన్ల వంటివని, ఈ నగరాల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ నగరాల నుంచి వచ్చే అభివృద్ధి ప్రతిపాదనలకు సత్వరమే అనుమతులు ఇచ్చేందుకు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)లో ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ లేదా సింగిల్ విండో వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణకు అత్యంత కీలకమైన రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు విస్తరణ, మూసీ నది సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ రేడియల్ రోడ్లు, హైదరాబాద్‌మచిలీపట్నం పోర్టు మధ్య 12 లైన్ల ఎక్స్‌ప్రెస్ హైవే, రైల్వే లైన్ వంటి పెండింగ్ ప్రాజెక్టులను సీఎం రేవంత్ ప్రస్తావించారు. "ఈ ప్రాజెక్టులపై చర్చించేందుకు తెలంగాణ కోసం ఒక రెండు గంటల సమయం కేటాయించి ప్రత్యేక సమీక్ష నిర్వహించండి. మా ప్రతిపాదనలన్నింటినీ మీ ముందు ఉంచుతాం" అని కోరారు.

## దేశ ఆర్థికాభివృద్ధికి సైబరాబాద్ కీలకం

**మొదటిపేజీ తరువాయి**

రహదారులు, రైల్వేలు, టెక్స్‌టైల్, ఇంధన రంగాల్లో కేంద్రం భారీ పెట్టుబడులు పెడుతోందని వెల్లడించారు.

**సైబరాబాద్ దేశానికి గ్రోత్ ఇంజన్**

హైదరాబాద్ మహానగరం, ముఖ్యంగా సైబరాబాద్ ప్రాంతం దేశ ఆర్థికాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్‌లా మారిందని ప్రధాని కొనియాడారు. ఐటీ, ఫార్మా, డిజిటల్ సేవలు, స్టార్టప్‌లు, ఈవీ తయారీ, డేటా సెంటర్లు వంటి రంగాల్లో తెలంగాణ విశేషంగా ముందుకు వెళ్తోందన్నారు. ప్రపంచ స్థాయి సంస్థలు హైదరాబాద్‌ను పెట్టుబడుల కేంద్రంగా ఎంచుకోవడం రాష్ట్ర సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోందని చెప్పారు.

ఇక్కడి యువత నైపుణ్యం, మౌలిక వసతులు, పారిశ్రామిక వాతావరణం కారణంగానే అనేక బహుళజాతి సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెడుతున్నాయని ప్రధాని వ్యాఖ్యానించారు. దీంతో ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతున్నాయని తెలిపారు.

**వరంగల్‌కు పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్క్**

వరంగల్‌లో ఏర్పాటు కానున్న 'పీఎం మిత్ర' కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ తెలంగాణ టెక్స్‌టైల్ రంగ చరిత్రలో కీలక మైలురాయిగా నిలుస్తుందని ప్రధాని అన్నారు. రూ.1,695.54 కోట్లతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పత్తి ఉత్పత్తిలో తెలంగాణకు ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని టెక్స్‌టైల్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఈ పార్క్ ద్వారా తయారీ యూనిట్లు, ఎగుమతులు, ముడిసరుకు సరఫరా వ్యవస్థలు, లాజిస్టిక్స్ రంగాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. దేశ టెక్స్‌టైల్ రంగాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.

**జహీరాబాద్‌లో స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రూ.2,360.54 కోట్లతో అభివృద్ధి చేయనున్న ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టును ప్రధాని ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పారిశ్రామిక పెట్టుబడులు భారీగా ఆకర్షితమవుతాయని కేంద్రం భావిస్తోంది. ఆధునిక పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు, డిజిటల్ సదుపాయాలు, గ్రీన్ ఎనర్జీ ఆధారిత వ్యవస్థలు ఇందులో ఏర్పాటు కానున్నాయి.

ఈ స్మార్ట్ సిటీ ద్వారా దేశీయ, విదేశీ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టే అవకాశాలు మరింత పెరుగుతాయని అధికారులు పేర్కొంటున్నారు. పరిశ్రమల విస్తరణతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

**రహదారులు, రైల్వేల అభివృద్ధికి ప్రాధాన్యం**

జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని ప్రధాని వెల్లడించారు. తెలంగాణలో కూడా పలు కీలక రహదారి ప్రాజెక్టులు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా జాతీయ రహదారి 167 విస్తరణలో గుడెబల్లూర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు రూ.3,175 కోట్లతో చేపట్టిన పనులను ప్రారంభించారు.ఈ రహదారి అభివృద్ధి ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వ్యాపార, పారిశ్రామిక కార్యకలాపాలకు ఊతం లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా దక్షిణ తెలంగాణ జిల్లాలకు ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోగపడనుంది.

అదేవిధంగా రూ.1,243 కోట్లతో చేపట్టిన 118 కిలోమీటర్ల కాజీపేటవిజయవాడ మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టు, రూ.292 కోట్లతో నిర్మిస్తున్న 21 కిలోమీటర్ల కాజీపేట రైల్ అండ్ రైల్ బైపాస్ లైన్లను కూడా ప్రధాని ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రైల్వే రవాణా సామర్థ్యం పెరిగి సరుకు రవాణా వేగవంతం కానుంది.

**ఇంధన రంగంలో కీలక అడుగు**

హైదరాబాద్ సమీపంలోని మల్కాపూర్ వద్ద రూ.611 కోట్లతో నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్ పీవోఎల్ ప్రాజెక్టును ప్రధాని ప్రారంభించారు. ఇంధన నిల్వ, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఇంధన మౌలిక వసతులను కేంద్రం అభివృద్ధి చేస్తోందని ప్రధాని తెలిపారు.

**తెలంగాణకు కేంద్రం పూర్తి సహకారం**

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మౌలిక వసతులు, పరిశ్రమలు, రవాణా, ఉపాధి, టెక్స్‌టైల్, డిజిటల్ రంగాల్లో రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి అంటే దేశాభివృద్ధేనని వ్యాఖ్యానించారు.

కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ప్రధాని అన్నారు. తెలంగాణ యువత దేశ అభివృద్ధిలో ముందుండాలని ఆకాంక్షించారు. అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో తెలంగాణ కీలక భాగస్వామిగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి?

**మొదటిపేజీ తరువాయి**



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు అమలు కాలేదని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో గొప్పలు చెప్పిన నాయకులు ఇప్పుడు ప్రజల ముందుకు రావడం లేదన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, యువత కోసం ప్రకటించిన పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రజలను అబద్ధపు హామీలతో మభ్యపెట్టడం కాంగ్రెస్ పార్టీకి కొత్త కాదని, గతంలోనూ ఇదే విధానాన్ని అనుసరించిందని వ్యాఖ్యానించారు.

తెలంగాణ అభివృద్ధిలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వ పాత్ర ఎంతో కీలకమని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. గత 11 ఏళ్లలో తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం దాదాపు రూ.12 లక్షల కోట్ల నిధులను కేటాయించిందన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి కోసం మాత్రమే రూ.1.85 లక్షల కోట్లు మంజూరు చేశామని తెలిపారు. రాష్ట్రంలో రోడ్ల విస్తరణ, ఎక్స్‌ప్రెస్‌వేలు, ఫ్లైఓవర్లు, జాతీయ రహదారుల నిర్మాణం వంటి పనులు కేంద్ర నిధులతోనే జరుగుతున్నాయని పేర్కొన్నారు.

రైల్వే రంగంలోనూ తెలంగాణకు కేంద్రం పెద్దపీట వేసిందని ఆయన తెలిపారు. రాష్ట్రానికి ఐదు వందేభారత్ రైళ్లు కేటాయించామని, 42 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామని వెల్లడించారు. అంతేకాకుండా మూడు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులను కూడా తెలంగాణకు అనుసంధానం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కేంద్రం చేపడుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం కావాలనే ప్రజలకు తెలియనీయకుండా చేస్తోందని ఆరోపించారు.

రాష్ట్రంలో అమలవుతున్న సన్నబియ్యం పథకానికి కూడా కేంద్ర ప్రభుత్వమే 80 శాతం నిధులు ఇస్తోందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. అయితే ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చెప్పకుండా తమకే క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. "ఇవన్నీ రాహుల్ గాంధీ ఇచ్చారా? లేక కేసీఆర్ తెచ్చారా? ఇది మోదీ ప్రభుత్వ నిబద్ధత కాదా?" అంటూ సభలో ప్రశ్నించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై కూడా కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితమైందని ఆరోపించారు. ముఖ్యంగా ముస్లింల కోసమే ప్రభుత్వం పనిచేస్తోందని, సమాజంలో విభజన రాజకీయాలకు కాంగ్రెస్ తెరలేపిందని మండిపడ్డారు. 'SIR' పేరుతో ప్రభుత్వం ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యలను పక్కనబెట్టి మత రాజకీయాలపై దృష్టి పెట్టడం కాంగ్రెస్ అసలు స్వరూపమని విమర్శించారు.

గతంలో పదేళ్ల పాటు తెలంగాణ ఒకే కుటుంబ పాలనలో నలిగిపోయిందని, ఇప్పుడు గాంధీ కుటుంబం ఆధీనంలోకి వెళ్లిపోయిందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఒకప్పుడు బీఆర్ఎస్ కుటుంబ పాలనతో రాష్ట్రం నష్టపోయిందని, ఇప్పుడు కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాలకే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే ప్రభుత్వం బీజేపీ మాత్రమేనని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ అబద్ధపు గ్యారంటీలతో ప్రజలను మోసం చేస్తుందని, కానీ బీజేపీ ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్రంలో వరుసగా మూడుసార్లు బీజేపీ అధికారంలోకి రావడానికి ఇదే ప్రధాన కారణమని తెలిపారు. ప్రజలు మోదీ నాయకత్వంపై విశ్వాసం ఉంచుతున్నారని, అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన వల్లే బీజేపీ దేశవ్యాప్తంగా బలపడుతోందన్నారు.

దేశంలోని 21 రాష్ట్రాల్లో బీజేపీ లేదా బీజేపీ కూటమి అధికారంలో ఉండటమే తమ పనితీరుకు నిదర్శనమని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కూడా బీజేపీ ప్రభావం రోజురోజుకు పెరుగుతోందని, గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎనిమిది ఎంపీ స్థానాలు గెలుచుకోవడం ఇందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ మరింత బలపడుతుందని, ప్రజలు కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా బీజేపీని చూస్తున్నారని అన్నారు.

తెలంగాణ అసలైన అభివృద్ధి, అవినీతి రహిత పాలన, ప్రజల సంక్షేమం కేవలం 'మోదీ గ్యారంటీ'తోనే సాధ్యమని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో రాజకీయ మార్పు తప్పనిసరిగా వస్తుందని, ప్రజలు త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. సభలో బీజేపీ శ్రేణులు భారీగా పాల్గొని కిషన్‌రెడ్డి ప్రసంగానికి మద్దతు తెలిపారు.

## తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

- **తెలంగాణ కీలక ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి**
- **మోడీకి టీపీసీసీ చీఫ్ లేఖ.. మెట్రో, మూసీ ప్రాజెక్టులకు నిధుల విజ్ఞప్తి**
- **తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రధాని మోడీకి లేఖ**
- **రాష్ట్ర ప్రగతికి కీలక ప్రాజెక్టులపై కేంద్ర చొరవ కోరిన కాంగ్రెస్ నేత**
- **హైదరాబాద్ మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర సహకారం అవసరం**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్ర ప్రగతికి ఊతమిచ్చే కీలక ప్రాజెక్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతూ టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో విస్తరణతో పాటు మూసీ పునరుద్ధరణ వంటి ప్రాజెక్టులకు ఆర్థిక సాయం, అనుమతులు మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నగరం నలుమూలలా మెట్రో సేవలను విస్తరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలకు కేంద్రం మద్దతు ఇవ్వాలని మహేష్ గౌడ్ కోరారు. ముఖ్యంగా మెట్రో రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులు మంజూరు చేయడంతో పాటు, తగినన్ని నిధులు విడుదల చేయాలని లేఖలో పేర్కొన్నారు.

మూసీ పునరుద్ధరణ.. ఆర్‌ఆర్‌ఆర్‌కు సాయం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుద్ధరణ (Musi Rejuvenation) ప్రాజెక్టుకు కేంద్రం ఆర్థికంగా తోడ్పాటు అందించాలని కోరారు. అలాగే, రీజినల్ రింగ్ రోడ్ (RRR) పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని, గ్రీన్ ఫీల్డ్ హైవేల విస్తరణకు సహకరించాలని విన్నవించారు. హైదరాబాద్ శివారు ప్రాంతాలను కలిపే రేడియల్ రోడ్ల అభివృద్ధికి కేంద్రం ఆర్థిక సాయం అందించాలి. గ్రీన్ ఫీల్డ్ హైవేల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి, పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలి. రాష్ట్ర అభివృద్ధిలో రాజకీయాలకు తావులేకుండా, కేంద్రం తన వంతు బాధ్యతగా నిధుల విడుదల చేయాలని కోరారు. తెలంగాణలోని మౌలిక సదుపాయాల కల్పనలో కేంద్రం క్రియాశీలకంగా వ్యవహరించాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి వెళ్లే ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించాలని మహేష్ గౌడ్ ఈ లేఖ ద్వారా ప్రధానిని కోరారు.

## రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నా రేవంత్ రెడ్డికి కనికరం లేదు

**మొదటిపేజీ తరువాయి**

కన్నీళ్లు పెట్టుకుంటున్నా రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి.. మీకు ఢిల్లీకి పోవడం, హైదరాబాద్‌కు రావడం తప్ప వేరే పనే లేదా? ఢిల్లీకి వెళ్లి కప్పం కట్టడం తప్ప.. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతుల కష్టాలు ముఖ్యమంత్రికి, మంత్రులకు పట్టవా? అని ప్రశ్నించారు. ఇంతవరకు వడ్ల కొనుగోళ్లపై ఒక్క రోజైనా కలెక్టర్ల కాన్ఫరెన్స్ పెట్టారా? మీ మంత్రులతో ఒక్క మీటింగ్ అయినా చేశారా అని నిలదీశారు. ఇవాళ మెదక్ జిల్లా చేగుంట మండలం కర్ణాల్పల్లి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన హరీశ్ రావు ఈ సందర్భంగ మాట్లాడారు.

**ఏసీ రూముల్లో కూర్చుని అబద్ధాలు**

ఈ ప్రభుత్వానికి రైతులంటే లెక్క లేదని వారి పట్ల చిన్నచూపు ఉన్నందు వల్లే ఈ దుస్థితి దాపురించిందన్నారు. ఏసీ రూముల్లో కూర్చుని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని ఆయన ఒకసారి పోలీసులను పక్కనపెట్టి రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు తిరిగితే రైతుల కన్నీళ్లు, కష్టాలు ఏంటో అర్థమవుతాయన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆ పార్టీ సర్పంచులే ఇవాళ వడ్లు కొనాలని కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేస్తున్నారంటే మీ ప్రభుత్వ పరిస్థితి ఎంత దయనీయంగా, దారుణంగా తయారైందో ఒకసారి అర్థం చేసుకోవాలన్నారు. ప్రతిపక్ష నాయకులు సోషల్ మీడియాలో ట్వీట్లు చేస్తే కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్న ముఖ్యమంత్రికి.. రైతుల బాధల గురించి ఇంటెలిజెన్స్, పోలీసులు నివేదికలు ఇవ్వడం లేదా? అని నిలదీశారు. ప్రభుత్వం తక్షణమే మేల్కొని లారీలు పంపించి, కాంటాలు పెట్టి వడ్లు కొనాలని లేదంటే రైతుల పక్షాన బీఆర్ఎస్ (BRS Party) ఎమ్మెల్యేలు, నాయకులం అంతా కలెక్టరేట్లను ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌లో అవినీతి**

మక్కలు, శనగలు, సన్ ఫ్లవర్ అమ్మిన రైతులకు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా వేయలేదన్నారు. జొన్నల కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభమే కాలేదన్నారు. 35 రోజుల నుంచి సన్ ఫ్లవర్ కొనుగోళ్లు ఆగిపోయాయి. కుప్పల కింద ఆ పంటకు చెదలు పడుతున్నా ప్రభుత్వానికి కనికరం లేదని మండిపడ్డారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి వల్లే నేడు అది దివాలా తీసిందని ఆ సంస్థ NPA కావడంతో బ్యాంకులు అప్పులివ్వడం లేదన్నారు. దాంతో దొడ్డిదారిన కోఆపరేటివ్ బ్యాంకు నుంచి మార్క్‌ఫెడ్ కు, అక్కడి నుంచి సివిల్ సప్లైస్ కు డబ్బులు మళ్లించారు. మీ అవినీతి, తప్పులకు రైతులను బలిచేస్తున్నారు.



## తమిళనాడు సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకారం

**మొదటిపేజీ తరువాయి**

రావడం ఇదే తొలిసారి కావడంతో యావత్ తమిళనాడు ఇప్పుడు పండుగ వాతావరణంలో మునిగిపోయింది. స్టేడియం లోపల, బయట లక్షలాదిగా తరలివచ్చిన అభిమానులు 'దళపతి.. సీఎం దళపతి' అంటూ చేసిన నినాదాలు మిన్నంటాయి. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ముఖ్యమంత్రి హోదాలో విజయ్ తన పాలనా ముద్రను చాటుతూ మూడు అత్యంత కీలకమైన ఫైళ్లపై సంతకాలు చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నారు.

విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చేసిన తొలి సంతకం రాష్ట్రంలోని సామాన్యులకు పెద్ద ఊరటనిచ్చింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తూ ఆయన ఫైలుపై సంతకం చేశారు. దీనివల్ల రాష్ట్రంలోని కోట్లాది మధ్యతరగతి, పేద కుటుంబాలకు విద్యుత్ భారరం తగ్గనుంది. ఇక రెండో సంతకంగా మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ షీ టీమ్స్ తరహాలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక నిఘా విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో పెరిగిపోతున్న మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు 'ఈగిల్' వ్యవస్థ తరహాలో స్పెషల్ ఫోర్స్‌ను రంగంలోకి దించుతూ మూడో సంతకాన్ని పూర్తి చేశారు. ఈ మూడు నిర్ణయాలు విజయ్ పాలనలో ప్రజల అవసరాలకు, భద్రతకు ఎంతటి ప్రాధాన్యత ఉంటుందో స్పష్టం చేస్తున్నాయి.

ప్రమాణ స్వీకార వేదికపై ఆసక్తికర సన్నివేశాలు కూడా చోటుచేసుకున్నాయి. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం విజయ్, వేదికపై ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో కలిసి సెల్ఫీ దిగారు. అంతేకాకుండా స్టేడియంలో ఉన్న వేలాది మంది అభిమానులను కవర్ చేస్తూ తన మొబైల్ ఫోన్‌లో సెల్ఫీ వీడియోను రికార్డు చేయడం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. తనను సినీ రంగంలో అగ్రస్థానంలో నిలబెట్టిన అభిమానులే ఇప్పుడు సీఎంగా గెలిపించారన్న కృతజ్ఞతా భావంతో ఆయన అందరికీ అభివాదం చేస్తూ మురిసిపోయారు. విజయ్‌తో పాటు ఆయన కేబినెట్‌లో తొమ్మిది మంది మంత్రులు ప్రమాణం చేశారు. సెంగోట్టియన్, అధవ అర్జున్, ఎన్ ఆనంద్, డా. కేజీ అరుణ్ రాజ్, నిర్మల్ కుమార్, రాజ్‌మోహన్, పి. వెంకట రమణన్, డా. టీకే ప్రభు మరియు ఎస్. కీర్తనలు విజయ్ జట్టులో మంత్రులుగా బాధ్యతలు తీసుకున్నారు.

ముఖ్యమంత్రిగా తన తొలి ప్రసంగంలో విజయ్ ఎంతో భావోద్వేగానికి లోనయ్యారు. తాను ఒక సాధారణ డైరెక్టర్ కుమారుడిగా మొదలై, జీవితంలో ఎన్నో ఆకలి బాధలు, అవమానాలు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానని గుర్తు చేసుకున్నారు. మైనార్టీలకు, పేదలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. "మీరు నన్ను 25 ఏళ్లుగా మీ తమ్ముడిగా, అన్నగా గుండెల్లో పెట్టుకున్నారు. మీ కోసమే రాజకీయాల్లోకి వచ్చాను. కుట్రలు, కుతంత్రాలను దాటుకుని నన్ను నమ్మినందుకు మీకు ఎప్పుడూ రుణపడి ఉంటాను" అని వ్యాఖ్యానించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం 'విజయ్ మామ' అన్నీ మంచి పనులే చేస్తాడంటూ పిల్లలను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు ఆకట్టుకున్నాయి. అలాగే డీఎంకే ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసిందని, రాష్ట్రం ప్రస్తుతం 10 లక్షల కోట్ల అప్పులో ఉందని ఆరోపిస్తూ, త్వరలోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై 'శ్వేతపత్రం' విడుదల చేస్తామని స్పష్టం చేశారు.

## భయపడటానికి ఫామ్‌హౌస్‌లో ఎలుకను కాదు..

**మొదటిపేజీ తరువాయి**



కడుపు నిండుతుందా? అని కాంగ్రెస్ నేతలు హేళనగా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. అదే నినాదంతో బెంగాల్‌లో బీజేపీ (BJP) ప్రభుత్వం ఏర్పడిందనే విషయాన్ని కాంగ్రెస్ నేతలు మర్చిపోవద్దు. తెలంగాణలోనూ వచ్చే ఎన్నికల్లో పక్కాగా అధికారంలోకి వస్తాం. సనాతన ధర్మం కోసం మేము నిరంతరం పనిచేస్తాం.. మా ధర్మాన్ని కించపరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు' అని బండి సంజయ్ స్పష్టం చేశారు.

గ్యారంటీలపై నిలదీత..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు (Six Guarantees) ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ముఖ్యంగా రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ధాన్యం కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఈ క్రమంలోనే రాష్ట్ర బీజేపీ నేతలకు కీలక సూచన చేశారు. నాయకులు తమ మధ్య ఉన్న అభిప్రాయభేదాలను పక్కన పెట్టి పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజకీయ ప్రత్యర్థులపై విరుచుకుపడుతూ.. 'బీజేపీ కార్యకర్తను అయినందుకు నేను ఎంతగానో గర్వపడుతున్నాను. పార్టీ తలవంచుకునే పని నేను ఎప్పుడూ చేయలేదు. నన్ను రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. బెదిరింపులకు భయపడటానికి నేనేమీ ఫామ్‌హౌస్‌లో దాక్కునే ఎలుకను కాదు' అని బండి సంజయ్ ఫైర్ అయ్యారు.

# అన్నదాతలు జరభద్రం

- నాసిరకం విత్తనాలతో జాగ్రత్త అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి
- రైతులను మోసగించి గ్రామాల్లో నకిలీ విత్తనాలు విక్రయాలు చేస్తుంటారు
- సరిహద్దు రాష్ట్రాల నుంచి నకిలీల బెడద.

**ఆదిలాబాద్ బ్యూరో డిడి 9 వార్త న్యూస్**

ఏదో ఒక బ్రాండ్ పేరట నకిలీలు రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తుంటారు కేటుగాళ్లు రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు, వ్యవసాయ అధికారులు వానాకాలం సీజన్ మొదలైంది రైతులు విత్తనాల సేకరణలో నిమగ్నమయ్యారు.దీంతో రైతులకు పేరొందిన కంపెనీల విత్తనాలను తక్కువ ధరకే ఇస్తామని గ్రామాలలోకి తెచ్చి ఇస్తామని నమ్మిస్తూ వ్యాపారులు నకిలీ విత్తనాలను విక్రయిస్తు రైతులను మోసగిస్తుంటారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బైంసా, బోథ్, ఇచ్చోడా, ఉట్నూరు తదితర డివిజన్లలో ఈ నకిలీ విత్తనాల దందా జోరుగా జరుగుతుంటుంది జిన్నింగు మిల్లుల నుంచి తెచ్చిన పత్తి గింజలు సాధారణ పద్ధతుల్లో సేకరించిన విత్తనాలను విత్తన శుద్ధి మందులను పట్టించి అందమైన కవర్లు డబ్బాల్లో నింపి ప్రముఖ కంపెనీల పేరట లేదా కొత్త కంపెనీ విత్తనాలు అని రైతులకు అంటగడుతుంటారు.రైతులు జాగ్రత్తగా వీటిని గుర్తుంచుకొని చూసి తీసుకోవాలి విత్తనాల డబ్బాలపై బస్తాలపై పూర్తి వివరాలు లేబుల్ రూపంలో ఉండాలి బ్యాచ్ నెంబర్ ఉండాలి కానీ నకిలీ విత్తనాలకు ఏమీ ఉండవు

కొందరు ఏజెంట్లను పెట్టుకొని అక్రమంగా అమ్మకాలు జరుపుతుంటారు రైతన్నలు జరభద్రం. తక్కువ ధర అధిక దిగుబడి త్వరగా వంట చేతకొస్తుందని నమ్మిస్తూ రైతులను మోసగించి పలువురు వ్యాపారులు నకిలీ విత్తనాలను అంటగడుతుంటారువిక్రయాల జరిపేటప్పుడు వాటికి రసీదు ఇవ్వాలి.

రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు రసీదులు తప్పకుండా తీసుకోవాలి.

ఈ నకిలీ విత్తనాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం దాడులు తనిఖీలు నిర్వహిస్తున్న వ్యాపారుల దందా అక్కడక్కడ సాగుతూనే ఉంది. రీసెంట్ గా మొన్న పోలీసులు జరిపిన దాడులలో ఇచ్చోడ మండలానికి చెందిన ఓ వ్యక్తి నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని కేసు నమోదు చేశారు.నకిలీ విత్తనాలు మొలకెత్తినా పైరు ఎదగదు చీడపీడలను తట్టుకోలేదు. విత్తనాలు నాటిన తర్వాత పది రోజుల తర్వాతనే ఇవి నకిలీవి అని గుర్తించగలుగుతున్నరు అప్పుడు రైతులు మోసపోయినట్లు గుర్తించినప్పటికీ ఆ విక్రయదారుడు జాడ తెలియడం లేదు ఆంధ్ర ప్రదేశ్ మహారాష్ట్ర కర్ణాటక ఛత్తీస్గఢ్ గుజరాత్ నుంచి నకిలీ విత్తనాలను రాష్ట్రంలోకి అక్రమంగా తరలిస్తు సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు చేస్తున్నారు కేటుగాళ్లు .సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసినా వ్యాపారులు అనేక విధాలుగా మన రాష్టానికి నకిలీ విత్తనాలను తీసుకొస్తున్నారు. అధిక శాతం రైళ్ల ద్వారానే ఈ నకిలీ విత్తనాలు రవాణా అవుతున్నట్లు సమాచారం .ప్రముఖ విత్తన కంపెనీలు పక్కాగా నాణ్యత పరీక్షలు నిర్వహించి తర్వాతే మార్కెట్లోకి విత్తనాలను విడుదల చేస్తాయి అయితే ఈ పరీక్షల్లో విఫలమైన విత్తనాలను కొందరు వ్యాపారులు సేకరించి ఏదో ఒక బ్రాండ్ పేరిట రైతులకు అంటగడుతున్నారు దీని వల్ల రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుంది. కనుక సంబంధిత అధికారులుఈ నకిలీ విత్తనాల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు రైతులు.

**మడి గణేష్ సీనియర్ జెర్నలిస్ట్**





## బోధన్ గోశాలకు బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

**బీర్కూర్, మే 10(డిడి9 వార్త)**

కొద్ది రోజుల క్రితం బోధన్‌లోని ఏకచక్రేశ్వర గోశాలలో జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు రూ.4 లక్షల విలువైన గడ్డి కట్టలు (పశుగ్రాసం) అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే.ఈ ఘటనను తెలుసుకున్న బీర్కూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు,సామాజిక సేవకుడు ,రక్తదాన ఫౌండర్,గోమాత సేవకుడు సితలే రమేష్ వెంటనే స్పందించారు.తమ వాట్సాప్ స్టేటస్ ద్వారా గో సేవకులు మరియు స్నేహితులకు సమాచారం అందించి సహాయం కోరగా,వారి సహకారంతో రూ.39 వేల నగదును బోధన్ గోశాల కమిటీకి అందజేశారు.అంతే కాకుండా ఇప్పటి వరకు సుమారు 650 గడ్డి కట్టలను కూడా గోశాలకు పంపించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు.

ఈ సేవలను గుర్తిస్తూ బోధన్ ఏకచక్రేశ్వర గోశాల కమిటీ తరపున సితలే రమేష్ ని చిన్నపాటి సన్మానంతో అభినందించారు.ఈ కార్యక్రమంలో గోశాల అధ్యక్షులు నేపాల్ సింగ్ (జీవన్ ఎలక్ట్రికల్స్), గో సేవకులు సురేష్ ఈనాని,శ్రీనివాస్,చరణ్,ఆయిల్ శివ,సోలపూర్ శివ,దత్తు పటేల్,ప్రవీణ్ గౌడ్,సంతోష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జనగణనలో బీసీ కుల గణన చేపట్టాలి: బీసీ సంక్షేమ సంఘం డిమాండ్

**నిజామాబాద్ జిల్లా, మే 10 (డీడీ9 వార్త) :**



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జాతీయ జనగణనలో బీసీ కుల గణనను అంతర్భాగం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీని తుంగలో తొక్కి, బీసీలకు కేంద్రం అన్యాయం చేస్తోందని విమర్శిస్తూ నిజామాబాద్ నగరంలోని పులాంగ్ చౌరస్తా వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనను పురస్కరించుకుని, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకు నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో నరాల సుధాకర్ మాట్లాడుతూ...1930లో బ్రిటీష్ పాలనలో కుల గణన జరిగిన తర్వాత దాదాపు వందేళ్లు గడుస్తున్నా నేటికీ బీసీల లెక్కలు తేల్చకపోవడం శోచనీయమన్నారు. దేశంలో చెట్లు, పుట్టలు, జంతువుల గణనపై చూపే శ్రద్ధ, మెజారిటీ జనాభా కలిగిన బీసీల విషయంలో చూపకపోవడంపై ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్రం మొండివైఖరి వీడి, కుల గణనపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శనం దేవేందర్, మాడవేడి వినోద్ కుమార్, కొట్టూరు చంద్రకాంత్, శ్రీలత, సాయి బసవ, బాలన్న, నర్సయ్య, సత్యనారాయణ, శంకర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ డిసిసి ని కలిసిన సిరికొండ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు.

**ఆదిలాబాద్ 10 మే ( డిడి9 వార్త న్యూస్ ):**

ఆదివారం రోజు సిరికొండ మండలం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ఆదిలాబాద్ డిసిసి అధ్యక్షులైన డాక్టర్. నరేష్ జాదవ్ ను కలిశారు. ఈ సందర్భంగా సిరికొండ మండలంలోని సమస్యలను డా.,,నరేష్. జాదవ్ కు వివరించడం జరిగినది. ఈ సందర్భంలో సిరికొండ మండలానికి ప్రత్యేకమైన దృష్టి సారించాలని నూతనంగా ఏర్పడిన సిరికొండ మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చెందే విధంగా ముందుకు తీసుకు వెళ్లాలని ఆయనను సిరికొండ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరడం జరిగినది. సిరికొండ మండలంలో చాలామంది గిరిజనులు కనీస నివాసగృహము లేకుండా చాలా కుటుంబాలు ఉన్నాయని, అలాగే గిరిజనేతరులు కూడా ఉన్నారని, వారిని గుర్తించి తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ ఇండ్లను ఎక్కువ మొత్తంలో సిరికొండ మండలానికి వచ్చే విధంగా కృషి చేయాలని అలాగే ఇచ్చోడ మండలం నుండి సిరికొండ వరకు రెండు వరుసల రహదారి గత ప్రభుత్వం మండల్ టు మండల్ రెండు వరుసల రోడ్డు నిర్మిస్తానని మాట ఇచ్చి మాట తప్పిందని, ఈ ప్రజా ప్రభుత్వం లో రెండు వరుసల రోడ్డు సిరికొండ మండలానికి మంజూరు చేయవలసిందిగా వారిని కోరడం జరిగినది. ఇట్టి విషయాన్ని సంబంధిత మంత్రి దృష్టికి అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి మా సిరికొండ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆయనను కోరారు. ఈ సందర్భంలో ఆదిలాబాద్ డిసిసి అధ్యక్షులు డాక్టర్. నరేష్ జాదవ్ తో పాటు ఆదిలాబాద్ డిసిసి వైస్ ప్రెసిడెంట్ భగునూరే.మాధవ్ రావ్ పటేల్, సిరికొండ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్. ఇమామ్, ఇచ్చోడ మహిబూబ్, చౌహన్.కిషన్ పటేల్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నీటి సంపులో పడి మూడేళ్ల చిన్నారి మృతి

**శంకర్ పల్లి మే 10(డీడీ9 వార్త):**



జన్వాడ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారి ప్రియాన్షు ఆడుకుంటూ ఇంటి సమీపంలో ఉన్న నీటి సంపు వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు సంపులో పడిపోవడంతో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు చిన్నారి కనిపించకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికారు. అనంతరం నీటి సంపులో చిన్నారి మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న స్థానికులు, గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబాన్ని ఓదార్చారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చిన్నపిల్లలు ఆడుకునే ప్రాంతాల వద్ద భద్రతా చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా నీటి సంపులు, బావులు, ట్యాంకులకు రక్షణ కవర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు సూచిస్తున్నారు.

## కోరుట్లలో సామరస్యానికి చిరునామాగా చలివేంద్రం




- తామిరే మిల్లత్ ఇదారే దీన్ దోస్త్ ఆధ్వర్యంలో ప్రారంభం
- వేసవి వేడిలో ప్రయాణికులకు చల్లని ఉపశమనం
- మౌలానా ముజీబుర్ రహ్మాన్

**కోరుట్ల, మే 10 డీడీ9 వార్త**

కోరుట్ల పట్టణంలో మానవత్వం, సామాజిక సేవ, మత సామరస్యానికి ప్రతీకగా తామిరే మిల్లత్ ఇదారే దీన్ దోస్త్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. పట్టణంలోని గోదాం చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ప్రయాణికుల ప్రాంగణంలో ఈ చలివేంద్రాన్ని కోరుట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం వేణుగోపాల్, మౌలానా కరీం లు ప్రారంభించారు.వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు, ముఖ్యంగా ప్రయాణికులకు చల్లని తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. చలివేంద్రం వద్ద ప్రయాణికులకు చల్లని నీరు, అందిస్తూ మానవ సేవే మహోన్నతమైన సేవ అనే భావనను ప్రతిబింబిస్తున్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు, వార్డు కౌన్సిలర్ శీలం వేణుగోపాల్ మాట్లాడుతూ కోరుట్ల పట్టణంలో ప్రతి పండుగను, ప్రతి సామాజిక కార్యక్రమాన్ని అన్ని వర్గాల ప్రజలు కలిసి మెలిసి నిర్వహించుకోవడం గొప్ప సంప్రదాయం అని అన్నారు. మైనారిటీ సోదరులు ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ఎంతో ఆదర్శప్రాయమని కొనియాడారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.మౌలానా ముజీబుర్ రహ్మాన్ మాట్లాడుతూ రంజాన్, బక్రీద్ వంటి మత పరమైన సందర్భాలకే పరిమితం కాకుండా ప్రజల అవసరాల సమయంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమ సంస్థ లక్ష్యమని తెలిపారు. వేసవి కాలంలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజల ఆశీర్వాదాలతో ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరింత విస్తృతంగా చేపడతామని చెప్పారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ మహమ్మద్ వసీం, మాజీ కౌన్సిలర్ మహమ్మద్ నయీమ్, డాక్టర్ జాకీర్ హుస్సేన్, డాక్టర్ సలీం,రియాజ్, మౌలానా ఆబిద్, డాక్టర్ భారీ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



## అనాథల ఆకలి తీర్చడం అభినందనీయం

**సికింద్రాబాద్, మే 10 (డీడీ9 వార్త):**

నగరంలో ఆకలితో అలమటిస్తున్న అనాథలు, నిరాశ్రయుల కోసం స్కై ఫౌండేషన్ చేస్తున్న కృషి ఎంతో గొప్పదని పలువురు కొనియాడారు. ఈ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో 300వ అన్నదాన కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో వాహనాల ద్వారా సంచరిస్తూ, ఫుట్‌పాత్‌లపై నివసించే నిరాశ్రయులను మరియు సంచార జాతుల వారిని గుర్తించి వారికి కడుపునిండా భోజనాన్ని అందించారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ ఫౌండర్ మరియు ప్రెసిడెంట్ డాక్టర్ వై. సంజీవ కుమార్ మాట్లాడుతూ.. సమాజంలో పేదరికం, ఆకలితో బాధపడుతున్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి కనీస సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పావని.ఓ, సేవసభ్యులు అఖిల్ తదితరులు పాల్గొని స్వయంగా ఆహారాన్ని పంపిణీ చేశారు. అనాథల పట్ల మానవత్వంతో స్పందిస్తున్న స్కై ఫౌండేషన్ సభ్యులను స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.





## పబ్లిక్ స్కూల్‌తో విద్యా హబ్‌గా కొడిమ్యాల

- సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి

**కొడిమ్యాల, మే 10 డీడీ9 వార్త:**

తెలంగాణ పబ్లిక్ స్కూల్ పథకం కింద కొడిమ్యాలలో పాఠశాల ఏర్పాటు కోసం గ్రామ పంచాయతీలో సమావేశం నిర్వహించారు. సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కేంద్రం పబ్లిక్ స్కూల్‌కు అనుకూలంగా ఉంటుందని, దీంతో మండలం విద్యా హబ్‌గా మారే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి కొడిమ్యాలలో పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరనున్నట్లు సర్పంచ్ తెలిపారు. సమావేశంలో ఉపసర్పంచ్ గుర్రం నర్సయ్య, వైస్ చైర్మన్ కొండూరి రాజేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలువేరి నారాయణ, వార్డు సభ్యులు రాపర్తి నర్సింగరావు, గ్రామస్థులు బోగరవి, కొండ నాగరాజు, అంకం జనార్ధన్, కైలాసాని సత్యనారాయణ, నసిరోద్దీన్, గుర్రం ప్రవీణ్, పిడుగు అనిల్, చొక్కాల నాగార్జున్, పోచమల్లు, ఉద్యోగస్థులు కొట్టాల తిరుపతి రెడ్డి, మల్లారపు రాజయ్య, నాంపల్లి మల్లేశం, సత్యనందం తదితరులు పాల్గొన్నారు.



# తమిళనాడు సీఎంగా దళపతి విజయ్.. 'జన నాయగన్' సినిమా రిలీజ్ ఎప్పుడంటే?

తమిళనాడు రాజకీయ చరిత్రలో నేడు ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. తమిళ సూపర్ స్టార్ 'దళపతి' విజయ్ మే 10వ తేదీన తమిళనాడు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో అత్యంత వైభవంగా జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విజయ్ తన కుటుంబ సభ్యులతో పాటు, తన పార్టీ TVK (తమిళగ వెట్రి కళగం) నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా వచ్చి విజయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

**డ్యాషింగ్ లుక్‌లో సీఎం**

ఎప్పుడూ సింపుల్‌గా కనిపించే విజయ్, తన ప్రమాణ స్వీకార వేడుక కోసం సంప్రదాయ దుస్తులకు భిన్నంగా ఫార్మల్ బ్లాక్ సూట్ - ప్యాంట్ ఎంచుకున్నారు. సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో ఆయన ఎంతో హుందాగా కనిపించారు. వెండితెరపై దళపతిగా అలరించిన విజయ్, ఇప్పుడు నిజ జీవితంలో ప్రజా నాయకుడిగా తన కొత్త ఇన్నింగ్స్‌ను స్టార్ట్ చేయడంపై ఆయన అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ వేడుకలో నటి త్రిష కృష్ణన్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. తన తల్లి ఉమా కృష్ణన్‌తో కలిసి హాజరైన త్రిష.. చీర కట్టుకుని, తలలో మల్లెపూలు పెట్టుకుని సంప్రదాయబద్ధంగా కనిపించారు. విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తుంటే ఆమె ఎంతో ఉత్సాహంగా కనిపించారు. కార్యక్రమం అనంతరం విజయ్ వారిని కలిసి ముచ్చటించారు.

**బాలనటుడి నుంచి బ్లాక్ బస్టర్ స్టార్ వరకు..**

విజయ్ సినీ ప్రస్థానం తన తండ్రి ఎస్.ఏ.చంద్రశేఖర్ దర్శకత్వంలో బాలనటుడిగా స్టార్ట్ అయ్యింది. 1992లో హీరోగా ఎంట్రీ ఇచ్చినా దళపతి, 1994లో వచ్చిన 'రసిగన్' సినిమాతో తొలి హిట్ అందుకుని 'ఇళయ దళపతి'గా అభిమానుల్లో గుర్తింపు పొందారు. 2003 తర్వాత వరుస విజయాలతో కోలీవుడ్ టాప్ స్టార్‌గా ఎదిగారు. 2017లో 'మెర్సల్' సినిమాతో 'దళపతి'గా మారిన విజయ్, రజనీకాంత్, కమల్ హాసన్ వంటి దిగ్గజాలకు దీటుగా తన మార్కెట్‌ను విస్తరించుకున్నారు.

**'జన నాయగన్' కోసం ఎదురుచూపులు..**

సీఎంగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో విజయ్ నటించిన లాస్ట్ మూవీగా ప్రచారంలో ఉన్న 'జన నాయగన్' రిలీజ్ కోసం అభిమానులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. పూజా హెగ్డే, బాబీ డియోల్, మమితా బైజూ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రం గత ఐదు నెలలుగా రిలీజ్ కాకుండా ఆగిపోయింది. నిజానికి ఈ మూవీ జనవరి 9న రిలీజ్ కావాల్సి ఉన్నా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. అయితే తమిళనాడులో సీఎంగా విజయ్ పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో, ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ సినిమా కోసం విజయ్ ఫ్యాన్స్‌తో పాటు సినిమా లవర్స్ కూడా చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



# టాలీవుడ్‌పై కన్నేసిన 'తుడరుమ్' దర్శకుడు

మలయాళంలో మంచి గుర్తింపు సంపాదించుకున్న దర్శకుల్లో తరుణ్ మూర్తి ఒకరు. ఈయన కొంతకాలం క్రితం మోహన్ లాల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన తుడరుమ్ చిత్రానికి దర్శకత్వం వహించాడు. ఈ సినిమా మలయాళ బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని అందుకుంది. ఇదే టైటిల్‌తో తెలుగులో విడుదలైన ఈ మూవీ టాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర కూడా మంచి విజయాన్ని సాధించింది. దీంతో తరుణ్ మూర్తికి తెలుగు ప్రేక్షకుల్లోనూ మంచి గుర్తింపు లభించింది. ఇక ఈ దర్శకుడు తన తదుపరి చిత్రాన్ని ఓ టాలీవుడ్ హీరోతో చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఓ యువ హీరోకి కథను వినిపించగా, ఆ కథ అతనికి బాగా నచ్చి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు నిర్మాత ఫైనల్ కాలేదని, ప్రొడ్యూసర్ ఓకే అయిన వెంటనే ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఇక 'తుడరుమ్' లాంటి గొప్ప సినిమాతో ఆకట్టుకున్న తరుణ్ మూర్తి తెలుగులో సినిమా చేస్తే ఆ ప్రాజెక్ట్‌పై మంచి అంచనాలు ఏర్పడే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇకపోతే తాజాగా ఈ దర్శకుడు మెగాస్టార్ చిరంజీవిని కలవడం ఇండస్ట్రీలో ఆసక్తికరంగా మారింది. దీంతో చిరంజీవితో ఈయన సినిమా చేయబోతున్నారనే వార్తలు వైరల్ అయ్యాయి. ముఖ్యంగా 'తుడారం' రీమేక్ కోసం ఈ భేటీ జరిగిందని ప్రచారం జరిగింది. అయితే తాజాగా సోషల్ మీడియా వేదికగా దర్శకుడు దీనిపై స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. "నేను చిరంజీవి గారిని 'తుడారం' రీమేక్ గురించి కలవలేదు. చిరంజీవి గారు నన్ను వ్యక్తిగతంగా కలవాలని ఆయన టీమ్ నుంచి కాల్ వచ్చింది. వెంటనే ఫ్లైట్ ఎక్కి ఆయన ఇంటికి వెళ్లి కలిశాను. మేమిద్దరం సినిమాలు, వ్యక్తిగత జీవితంపై చాలా సేపు మాట్లాడుకున్నాం.

నేను తీసిన ప్రతి సినిమాలోని సన్నివేశాలను ఆయన ఎంతో



వివరంగా చెప్పడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ క్షణం నా జీవితంలో మరచిపోలేని అనుభూతిగా మిగిలిపోతుంది" అని తెలిపారు. అలాగే "ఎప్పటికీ సూపర్‌స్టార్‌గా నిలిచిన చిరంజీవి గారు ఇప్పటికీ సినిమాలను చిన్నపిల్లాడి ఉత్సాహంతో ఆస్వాదించడం ఆయన ప్రత్యేకత. జీవితంలో కొన్ని చిన్న క్షణాలే మన కలలను మరింత పెద్దవిగా మారుస్తాయి. కానీ ఇది చిన్న క్షణం కాదు.. నా జీవితంలోనే అతిపెద్ద ఆనంద క్షణం" అంటూ భావోద్వేగంగా రాసుకొచ్చారు. దీంతో అభిమానుల్లో మరోసారి ఆసక్తి పెరిగింది. చిరంజీవితో ఈ దర్శకుడి కాంబినేషన్‌లో సినిమా ఉండొచ్చని చాలామంది భావిస్తున్నప్పటికీ, దీనిపై మాత్రం ఆయన ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇక ఈ దర్శకుడు చిరంజీవితో కాకుండా మరో తెలుగు యువ హీరోతో సినిమా చేయబోతున్నట్లు ఓ వార్త వైరల్ అవుతుంది.

# ఇక్కడ నేర్చుకున్నది అక్కడ ప్రదర్శించే అవకాశం



హిందీలో తన అందచందాలతో క్రేజీ కథానాయికగా అలరిస్తోంది దిశా పటానీ. ఆమె హాలీవుడ్‌లోకి కూడా అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. 'స్టాటిగార్డ్స్ వర్సెస్ హాలీగార్డ్స్ సాగా'లోని మొదటి చిత్రం 'ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్'లో దిశా నటిస్తుంది. ఇందులో ఆమె జెస్సికా పాత్రను పోషిస్తున్నట్లు శుక్రవారం విడుదలైన ట్రైలర్‌తో స్పష్టం చేసింది చిత్రబృందం. ఈ చిత్రం గురించి దిశ మాట్లాడుతూ... ''ఇది చాలా ప్రత్యేకమైన ప్రాజెక్టు. ట్రైలర్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూశాను. తొలి అంతర్జాతీయ చిత్రంలో నటించడం మొదట థ్రిల్లింగ్‌గా అనిపించినా తర్వాత కొంచెం భయం వేసింది. కానీ, దీని వల్ల నటిగా నా నైపుణ్యాన్ని అన్వేషించుకునే అవకాశం లభించింది. అనుభవజ్ఞులైన, విభిన్నమైన నటీనటులతో కలిసి పనిచేయడం ఒక గొప్ప పాఠం నేర్పింది. కథ చెప్పడం అనేది భాష, భౌగోళిక సరిహద్దులకు అతీతమైనది. నటనలోని నిజాయతీనే విశ్వవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు మరింత దగ్గర చేస్తుంది. స్వదేశంలో నేను నేర్చుకున్న దానిని ప్రపంచ వేదికపైకి తీసుకొచ్చే అవకాశం ఈ సినిమా కల్పించింద''ని చెప్పింది. స్పేసీ, టైరిస్ గిబ్సన్, డాల్ఫ్ లండ్‌గ్రెన్‌లతో దిశా ఇందులో నటిస్తోంది. సూపర్ నేచురల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి కెవిన్ స్పేసీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ఏడాది విడుదల కానుందీ సినిమా. దిశ త్వరలోనే నటుడు ఇమ్రాన్ హష్మీ సరసన 'ఆవరాపన్ 2' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబవుతుంది. అగ్రహీరో అక్షయ్ కుమార్ 'వెల్‌కమ్ టు ది జంగిల్'లోనూ నటిస్తోంది.

# బుకింగ్స్ ఓపెన్ చేసిన గ్లోబల్ స్టార్.. అమెరికాలో 'పెద్ది' సందడి..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న "పెద్ది" సినిమాపై అంచనాలు మామూలుగా లేవు. ఈ క్రేజీ పాన్ ఇండియా మూవీ జూన్ 4న గ్రాండ్‌గా రిలీజ్ అవుతుండగా, అమెరికాలో మాత్రం ఒకరోజు ముందే అంటే జూన్ 3న భారీ ఎత్తున ప్రీమియర్స్ పడబోతున్నాయి. తాజాగా నార్త్ అమెరికాకు సంబంధించి బుకింగ్స్ ఓపెన్ అవ్వడమే కాకుండా, టికెట్ ధరలను కూడా అధికారికంగా ప్రకటించారు.

**తెలుగు వెర్షన్ టికెట్ ధరలు:**

ప్రీమియర్స్ (జూన్ 3): స్టాండర్డ్ 2D స్క్రీన్ల కోసం పెద్దలకు $25, పిల్లలకు $20 గా ఫిక్స్ చేశారు. ఒకవేళ మీరు బిగ్ స్క్రీన్లు (PLF) లేదా స్పెషల్ ఫార్మాట్లలో చూడాలనుకుంటే అదనంగా మరో $5 నుండి $10 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇక సినిమా రిలీజ్ అయిన మొదటి వారం టికెట్ రేట్లు కొంచెం తగ్గుతాయి. పెద్దలకు $20, పిల్లలకు $18 గా ఉండబోతున్నాయి. ఇక హిందీ, తమిళం, కన్నడ,మలయాళ వెర్షన్లకు మాత్రం ప్రీమియర్ రేట్లు ఉండవు. మొదటి రోజు నుండే సాధారణ ధరలకే టికెట్లు అందుబాటులో ఉంటాయి. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. శివ రాజ్‌కుమార్, జగపతి బాబు వంటి భారీ స్టార్ కాస్ట్ ఉండటంతో అమెరికా బాక్సాఫీస్ వద్ద చరణ్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.



# 'పెద్ది'పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్.. నా పాత్ర అలా ఉండబోతుంది

టాలీవుడ్ సీనియర్ నటుడు జగపతిబాబు తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తాను నటించిన పెద్ది గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా తన పాత్ర గురించి మాట్లాడుతూ పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించారు. జగపతిబాబు మాట్లాడుతూ... "నేను రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' సినిమాలో నటించాను. ఈ చిత్రంలో నా పాత్ర చాలా అద్భుతంగా ఉంటుంది. నా పాత్ర ట్రీట్మెంట్‌ను కూడా బుచ్చిబాబు చాలా కొత్తగా డిజైన్ చేశారు.

సినిమా విడుదలైన తర్వాత నా పాత్రను చూసి ప్రేక్షకులు ఖచ్చితంగా సర్ప్రైజ్ అవుతారు" అని అన్నారు. అలాగే ఈ సినిమా భారీ విజయాన్ని సాధిస్తుందని, ఇందులో పనిచేసిన నటీనటులు, టెక్నీషియన్స్, నిర్మాతలకు మంచి గుర్తింపు తీసుకువస్తుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఇప్పటికే జగపతిబాబు పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేయగా అది ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. దీంతో ఆయన పాత్రపై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. మరి ఈ సినిమాతో జగపతిబాబుకు ఎలాంటి గుర్తింపు వస్తుందో చూడాలి. పెద్ది చిత్రాన్ని జూన్ 4న తెలుగుతో పాటు తమిళ్, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో భారీ స్థాయిలో విడుదల చేయనున్నారు.



# వీరభద్రుడు ప్రీ రిలీజ్ ఈవెంట్ తేదీ.. వేదిక ఖరారు

సూర్యతాజాగా నటించిన చిత్రం 'కరుప్పు'. ఈ సినిమాను తెలుగులో 'వీరభద్రుడు' అనే టైటిల్‌తో విడుదల చేయనున్నారు. మూవీని తెలుగులో కూడా భారీ స్థాయిలో రిలీజ్ చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అందులో భాగంగా ప్రచార కార్యక్రమాలను జోరుగా నిర్వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన తెలుగు ప్రీ రిలీజ్ ఈవెంట్‌పై అధికారిక ప్రకటన విడుదలైంది. ఈ వేడుకను రేపు, అనగా మే 11వ తేదీన సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. అలాగే ఈరోజు ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటే సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇక ఈ సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటించగా, ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించారు. సాయి అభ్యంకర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. మే 14న ఈ చిత్రాన్ని తమిళంతో పాటు తెలుగులో కూడా విడుదల చేయనున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ విడుదల చేయనుంది.




# ఆ ఆరు నెలలు నరకం చూశా..

బాలీవుడ్ స్టార్ నటి కియారా అద్వానీ, తల్లి అయిన తర్వాత తన జీవితంలో చోటు చేసుకున్న భావోద్వేగ మార్పుల గురించి మొదటిసారి మనసు విప్పి మాట్లాడారు. 2025 జూలైలో తన కుమార్తె సారాయకు జన్మనిచ్చిన తర్వాత, తను ఎదుర్కొన్న పోస్ట్‌పార్టమ్ (బిడ్డ పుట్టిన తర్వాత వచ్చే మానసిక స్థితి) దశ గురించి ఒక ఇంటర్వ్యూలో వివరిస్తూ ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. బిడ్డ పుట్టిన తర్వాత తన గుర్తింపు పూర్తిగా మారిపోయిందని కియారా తెలిపారు. "మొదటి ఆరు నెలలు నాపై నాకు జాలి చూపించుకోవడం కూడా చాలా కష్టంగా అనిపించేది నరకం చూశా. ఎప్పుడూ ఇతరుల గురించి ఆలోచించే నేను, మొదటిసారి నా కోసం నేను సమయం కేటాయించుకోవాలని గ్రహించాను. నాలోని భావాలను అర్థం చేసుకోవడానికి, నన్ను నేను ప్రేమించుకోవడానికి ఈ మాతృత్వం ఒక గొప్ప మలుపులా నిలిచింది" అని కియారా ఎమోషనల్ అయ్యారు.

తన కష్టకాలంలో భర్త సిద్ధార్థ్ మల్హోత్రా అందించిన మద్దతును కియారా కొనియాడారు. "ఆ రోజుల్లో నేను చాలా సున్నితంగా ఉండేదాన్ని, చిన్న చిన్న విషయాలకే ఏడ్చేసేదాన్ని. సిద్ధార్థ్ తన సినిమా ప్రమోషన్లలో బిజీగా ఉన్నా, అర్ధరాత్రి వేళ కూడా మా అమ్మ ఇంటికి వచ్చి నన్ను కలిసేవాడు. డాక్టర్ సలహా మేరకు నన్ను ప్రతిరోజూ రాత్రి పూట బయట డ్రైవ్‌కు తీసుకెళ్లేవాడు. ఆ చిన్న ప్రయాణం నాకు స్వచ్ఛమైన గాలిని, మానసిక ప్రశాంతతను ఇచ్చేది" అని ఆమె చెప్పుకొచ్చారు. కాగా.. 2023లో పెళ్లి చేసుకున్న ఈ జంట, గతేడాది పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. ప్రస్తుతం కియారా తన తదుపరి చిత్రం 'టాక్సిక్' విడుదలకు సిద్ధమవుతోంది. కన్నడలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో యష్, నయనతార వంటి స్టార్లతో కలిసి ఆమె నటిస్తోంది. మాతృత్వంలోని కష్టసుఖాలను దాటుకుని, మళ్లీ వెండితెరపై మెరవడానికి కియారా సిద్ధంగా ఉన్నారు. ఇందులో రుక్మిణి వసంత్, తారా సుతారియా కూడా కీలక పాత్రలో కనిపించబోతున్నారు.



# దుబ్బాక రాజకీయం మూడు ముక్కలాట..?










- రాజకీయాలు అస్తవ్యస్తం
- కార్యకర్తలు మధ్యలో బలి
- అభివృద్ధి శూన్యం
- దుబ్బాక అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..

**దుబ్బాక, మే 10, (డిడి9 వార్త)**

దుబ్బాక నియోజకవర్గంలో రాజకీయం మూడు ముక్కలటగా ఉంది... అంతేకాకుండా రాజకీయాలు అస్తవ్యస్తం ఉన్నట్లు పలువురు కీలక నాయకులు అంటున్నట్లు సమాచారం..దుబ్బాక నియోజకవర్గం లో ఎమ్మెల్యే (బీఆర్ఎస్), ఎంపీ (బీజేపీ), అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభం చేసేది కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు... కానీ దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి అయినది శూన్యం.. కేవలం కొబ్బరికాయ కొట్టాగానే అభివృద్దా..? అని ప్రజలు అంటున్నారు. నాడు ఎమ్మెల్యేగా, మంత్రిగా దుబ్బాక నుండి ఉన్న చెరుకు ముత్యం రెడ్డి అభివృద్ధి లక్ష్యంగా ప్రతి గ్రామానికి రోడ్డు, బస్సు సౌకర్యం, మండలానికి మార్కెట్ యార్డు గత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ చేతుల మీదిగా , కస్తూరిబా హాస్టల్ లను, దళితుల అభివృద్ధి లక్ష్యంగా సాగు భూమి, ఇందిరా జల ప్రభ పథకం ద్వారా మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి చేతుల మీదిగా, మొక్కలను, పండ్ల తోటలను పెంచాలని నాటి వ్యవసాయ, ఉద్యాయవన శాఖ మంత్రి రాంరెడ్డి వెంకట్ రాం రెడ్డి తో పండ్ల తోటలను, మొక్కలను నాటించారు. అనంతరం జర్నలిస్ట్ గా పని చేసిన చిట్టాపూర్ వాస్తవ్యులు సోలిపేట రామలింగారెడ్డి ప్రస్తుత బీఆర్ఎస్ నాటీ టిఆర్ఎస్ ఎమ్మెల్యే గా, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ గా దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు తెచ్చి డబుల్ బెడ్ రూం ఇండ్లు, మిషన్ భగీరథ ద్వారా త్రాగు నీరు అందించారు. అనంతరం ఎమ్మెల్యే గా గెలిచినా బొప్పాపూర్ వాస్తవ్యులు రఘునందన్ రావు(బీజేపీ ) నియోజకవర్గంలోని ఇండ్లు లేని నిరుపేదలకు నిర్మాణం పూర్తి అయిన డబుల్ బెడ్ రూం ఇండ్లలో గృహ ప్రవేశం చేయించారు. గతం ఇలా ఉండగా... ప్రస్తుతం దుబ్బాక లో పార్టీ అధికారంలో ఉన్నాయి. దుబ్బాక ఎమ్మెల్యే గా పోతారం వాస్తవ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి గతంలో రెండు సార్లు ఎంపీగా, గత ఎమ్మెల్యే రఘునందన్ రావు ప్రస్తుత ఎంపీ నియోజకవర్గంకు చేసింది ఏమి లేదని ప్రజలు అంటున్నారు. ఇరు ఇద్దరు ప్రజాప్రతినిధులు గా ఉండి ఇలాంటి పదవి లేని, దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిగా ఉన్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ పథకాలు ప్రారంభం చేయడం ఏమిటి అని ప్రజలు, మేధావులు అనుకుంటున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజాప్రతినిధులు ప్రారంభించాలి కానీ ఎలాంటి పదవి లేని ప్రారంభం చేసిన దుబ్బాక అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి పార్టీలు పక్కన పెట్టి దుబ్బాక అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# రాష్ట్రంలో రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది..!

- కొనుగోలు జాప్యంపై ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం
- ప్రభుత్వం పై మండిపడ్డ మాజీ మంత్రి హరీష్ రావు

**దుబ్బాక, మే 10,(డిడి9 వార్త )**



రైతుల పరిస్థితి అతి దారుణంగా మారిందని, ధాన్యం కొనుగోలు చేయడం జాప్యం చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. ఆదివారం దుబ్బాక నియోజకవర్గంలోని కర్నాల్‌పల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో నెలకొన్న పరిస్థితులను చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... రాష్ట్రంలో రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా మారిందని మండిపడ్డారు. కర్నాల్‌పల్లి కొనుగోలు కేంద్రం ప్రారంభించి 25 రోజులు పూర్తయినా ఇప్పటివరకు కేవలం రెండు లారీలు మాత్రమే రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. 15 రోజులకు ఒక లారీ వస్తే రైతులు తమ ధాన్యాన్ని ఎప్పుడు అమ్ముకోవాలి.. వారి పరిస్థితి ఏంటి..? అని ప్రశ్నించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయిందని, మళ్లీ రైతులు ఎండ బెట్టి సిద్ధం చేసినప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కొనుగోలు కేంద్రంలో ఇదే పరిస్థితి కనిపిస్తోందని, రైతుల కళ్లలో కన్నీళ్లు మాత్రమే కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేసిన హరీష్ రావు... "ఇప్పటి వరకు ఒక్కసారి అయినా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష చేశారా..? ఒక్క మంత్రి అయినా జిల్లాల్లో పర్యటించి రైతుల సమస్యలు తెలుసుకున్నాడా?" అని ప్రశ్నించారు. ప్రభుత్వం రైతులను పూర్తిగా గాలికొదిలేసిందని, ఢిల్లీ పర్యటనలు, రాజకీయ కార్యక్రమాలకే పరిమితమైందని విమర్శించారు. గతంలో మంత్రులుగా పనిచేసిన అనుభవంతో చెబుతున్నామని, ఇంత ఘోరమైన పరిస్థితి ఎప్పుడూ చూడలేదన్నారు. రైతులు రోడ్లెక్కి ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, కాంగ్రెస్ నాయకులే కలెక్టరేట్ ముందు ధర్నాలు చేసే పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# అధైర్యా పడొద్దు రైతులకు అండగా నేనుంటా...

- ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి...
- పాపన్నపేటలో కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన..
- రైస్ మిల్లర్ ఇబ్బంది పెట్టొద్దు..
- ఎమ్మెల్యే రోహిత్ రావ్..

**మెదక్ (డిడి9 వార్త) ప్రతినిధి**



ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సూచించారు.ఆదివారం సాయంత్రం పాపన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు.కొనుగోలు ప్రక్రియలో రైస్ మిల్లర్లు ఇబ్బందులు పెడుతున్నారని స్థానిక నాయకులు, రైతులు ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి పలువురు రైస్ మిల్లర్లతో ఫోన్లో మాట్లాడారు.రైతులకు ఇబ్బందులు లేకుండా మిల్లుకు వచ్చిన వెంటనే ధాన్యాన్ని ఖాళీ చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని రైస్ మిల్లర్లకు సూచించారు.రైతులు అధైర్య పడవద్దని పండించిన ప్రతి చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు.అధికారులు ఎప్పటికపుడు కొనుగోలు ప్రక్రియను పరిశీలించాలని సూచించారు.ఎమ్మెల్యే వెంట మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, మండల నాయకులు ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంతప్ప, శ్రీనివాస్, హీరాలాల్, గౌస్, తదితరులున్నారు...

# ఘనంగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట, కళ్యాణ మహోత్సవం

- ముదిరాజ్ కులస్తులు, ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహణ కార్యక్రమం

**డిడి9 వార్త గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

గజ్వేల్ మండలం దాతర్ పల్లి గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ముదిరాజ్ కుల పెద్దమనిషి తలారి సత్యనారాయణ ఆలయ చైర్మన్ తలారి స్వామి ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట - కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించిన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట, కళ్యాణ మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్ కుల దైవమైన శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట గంగ తెప్ప పెద్దమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్భహించారు. అమ్మవారు ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని పడి పంట గొడ్డు గోదా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలనీ కోరారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కుల పెద్దమనిషి తలారి సత్యనారాయణ, టెంపుల్ చైర్మన్ తలారి స్వామి, ముదిరాజ్ కుల సంఘం సభ్యులు తలారి యాదగిరి, తలారి సత్యనారాయణ, బండ్ల



రాజు పాల్గొన్నారు.


అలాగే కాకి పడగల వారు వెంకటేశం, కిషోర్, నారాయణ, రాజారాం, అరవింద్, రఘునాథ్, సంజీవులు తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# దుబ్బాక నుండి కొండగట్టుకు పాదయాత్ర చేసిన అంజన్న భక్తులు..

- సుమారు 60 కిలోమీటర్లు పాదయాత్ర

**దుబ్బాక, మే 10, ( డిడి9 వార్త)**

ఆంజనేయస్వామి మాలాధారణ ధరించిన దుబ్బాకకు చెందిన సుమారు 30 నుండి 50 మంది హనుమాన్ దీక్ష దారులు శనివారం సాయంత్రం పాదయాత్ర తో ప్రారంభం చేసి ఆదివారం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆంజనేయ స్వామి భక్తిలో ఉంటే ఎంతో ప్రశాంతత ఉంటుందని వారన్నారు. దుబ్బాక నుండి కొండగట్టు వరకు సుమారు 60 కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేశారు. ఆంజనేయస్వామి దయతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ స్వామి మాలాధారణ భక్తులు కాల్వ రాజుతోపాటు ఆంజనేయ స్వామి మాలధారణ వేసిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ నాయకుడు సాప సాయిలు కుమార్తె వివాహానికి హాజరైన.... మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి..

**మెదక్ (డిడి9 వార్త) ప్రతినిధి**

హవేలిఘనపూర్ మండలం గాజిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాప. సాయిలు కుమార్తె మౌనిక వివాహం విజయ్ కుమార్ తో ఆదివారం మెదక్ కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్ లో ఘనంగా జరిగింది.ఈ వివాహానికి హాజరై మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.వీరి వెంట హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి , సర్పంచ్ సాయిలు,మాజీ సర్పంచ్ యామి రెడ్డి, శంకరంపేట మండల పార్టీ అధ్యక్షులు పట్లోరి. రాజు నాయకులు సాప. శ్రీనివాస్, పోచయ్య,పడాల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు...

# కుల వ్యవస్థ ఎరులై పారుతున్న పట్టించుకోని అధికారులు

- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బక్కిలి బాలకిషన్

**డిడి9 వార్త గజ్వేల్ నియోజకవర్గం**

జగదేవపూర్ మండలంలో కుల వ్యవస్థ ఏరులై పారుతున్న పట్టించుకోని అధికారులు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బక్కిలి బాలకిషన్ మండలంలోని పలు గ్రామాల్లో రోజుకో విధంగా దళితులను అవమానపరచు అవైలన చేస్తూ కులం పేరుతో దూషిస్తూ 78 ఏండ్ల స్వాతంత్రంలో మనం ఎక్కడ ఉన్నాం ఈ కుల వ్యవస్థ ఎట్లా నిర్మూలించాలి అనే దృక్పథంతో అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా ఎవరిస్తున్నారు నియోజకవర్గ ఎమ్మెల్యేగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నోరు మెదపడేందుకు అదేవిధంగా ఈ నియోజకవర్గానికి పార్లమెంట్ మెంబర్ గా ఎంపీ రఘునందన్ రావు నోరు మెదపరు ఎందుకు ఈ నియోజకవర్గ దళితులు అంటే మాజీ ముఖ్యమంత్రి ఎంపీకి ఎలక్షన్లు వచ్చినప్పుడు మాత్రమే దళితుల పట్ల ప్రేమ ఉల్ల పోసుకుంటారు కానీ దళితులపైన దాడులు జరిగితే నోరు మెదుపరు ఇట్లాంటి నాయకులను గ్రామాలలో రాకుండా అడ్డుకట్ట వేయాలని కెవిపిఎస్ డిమాండ్ చేస్తుందనీ వివక్షత జరిగిన కొద్ది గంటల్లో ప్రత్యక్షమై బాధ్యతల పట్ల ఎంతటి పోరాటంకైనా సిద్ధపడుతున్నది. ఈ నియోజకవర్గంలో ఇప్పటికే అధికారులకు వినతి పత్రాలు ఇచ్చి ఈ ప్రాంతంలో కుల వ్యవస్థ రోజురోజుకు పేరుకుపోతున్న క్రమం దీనికి అడ్డుకట్ట వేయాలని అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం జరిగింది కానీ అధికారులు ఎలాంటి అవేర్నెస్ కార్యక్రమాలు చేయకుండా నీరుగారిస్తున్నారు ఇష్యూ జరిగినప్పుడు అట్లాంటిది ఏమి జరుగుతుంది అని బాధ్యత పట్ల నీరుగార్చే విధంగా మాట్లాడుతున్నారు జిల్లా కలెక్టర్ గారు సిపి గారు వివక్ష జరిగి ఇన్ని రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఆ గ్రామాలను సందర్శించకుండా కుల వ్యవస్థను రూపుమాపే విధంగా చర్యలు తీసుకోకపోవడం చాలా బాధాకరం ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ గ్రామాలను సందర్శించి కుల నిర్మూలన రూపుమాపే విధంగా చర్యలు తీసుకోవాలని వివక్షతకు పాల్పడిన వారిని తక్షణమే రిమాండ్ చేసి జైలుకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ప్రజా సంఘాలు విద్యార్థులు మేధావులు అందరితో కలిసి జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



# సొంతగడ్డపై సీఎస్కే సూపర్ ఛేజింగ్... బ్యాటింగ్ లో ఉర్విల్ పటేల్ హీరోయిజం

- **చెపాక్‌లో లక్నోపై చెన్నై సూపర్ కింగ్స్ ఘన విజయం**
- **204 పరుగుల భారీ లక్ష్యాన్ని 19.2 ఓవర్లలోనే ఛేదించిన సీఎస్‌కే**
- **23 బంతుల్లో 65 పరుగులతో ఉర్విల్ పటేల్ విధ్వంసకర బ్యాటింగ్**
- **లక్నో తరఫున 33 బంతుల్లో 85 పరుగులు చేసిన జోష్ ఇంగ్లిస్**
- **ఐదు వికెట్ల తేడాతో గెలిచి పాయింట్ల పట్టికలో ముందుకు దూసుకెళ్లిన చెన్నై**

**డిడి9 వార్త:**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో భాగంగా చెన్నైలోని చెపాక్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై చెన్నై సూపర్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. పరుగుల వరద పారిన ఈ మ్యాచ్‌లో 204 పరుగుల భారీ లక్ష్యాన్ని చెన్నై జట్టు మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన లక్నోకు ఓపెనర్ జోష్ ఇంగ్లిస్ (33 బంతుల్లో 85; 5 ఫోర్లు, 10 సిక్సర్లు) విధ్వంసకర ఆరంభాన్నిచ్చాడు. పవర్ ప్లేలోనే లక్నో స్కోరు 91 పరుగులకు చేరింది. అయితే ఇంగ్లిస్ ఔటైన తర్వాత లక్నో వరుసగా వికెట్లు కోల్పోయింది. చివర్లో షాబాజ్ అహ్మద్ (25 బంతుల్లో 43 నాటౌట్) రాణించడంతో లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగుల భారీ స్కోరు సాధించింది. చెన్నై బౌలర్లలో జేమీ ఓవర్టన్ 3 వికెట్లు పడగొట్టాడు.

భారీ లక్ష్య ఛేదనలో చెన్నైకి శుభారంభం దక్కింది. సంజూ శాంసన్ (14 బంతుల్లో 28) మెరుపులు మెరిపించగా, అనంతరం క్రీజులోకి వచ్చిన ఉర్విల్ పటేల్ (23 బంతుల్లో 65; 2 ఫోర్లు, 8 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఐపీఎల్ రికార్డు సమం చేస్తూ, కేవలం 13 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (28 బంతుల్లో 42) అతనికి చక్కటి సహకారం అందించాడు. మధ్యలో కొన్ని వికెట్లు కోల్పోయి కాస్త తడబడినట్టు కనిపించినా, చివర్లో శివమ్ దూబే (7 బంతుల్లో 15*), ప్రశాంత్ వీర్ (12 బంతుల్లో 17*) ప్రశాంతంగా ఆడి జట్టుకు విజయాన్ని అందించారు



# ఉర్విల్ పటేల్ సునామీ బాదుడు.. 13 బంతుల్లోనే 50 రన్స్.. ఐపీఎల్ ఫాస్టెస్ట్ ఫిఫ్టీ రికార్డు సమం

- **13 బంతుల్లో హాఫ్ సెంచరీతో ఉర్విల్ పటేల్ సంచలనం**
- **ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగవంతమైన ఫిఫ్టీ రికార్డు సమం**
- **సీఎస్కే తరఫున ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ నమోదు**
- **తొలి 8 బంతుల్లోనే ఆరు సిక్సర్లు బాదిన తొలి ఐపీఎల్ బ్యాటర్‌గా రికార్డు**
- **భావోద్వేగంతో తన ఇన్నింగ్స్‌ను తండ్రికి అంకితమిచ్చిన ఉర్విల్**

**డిడి9 వార్త:**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) టాప్ ఆర్డర్ బ్యాటర్ ఉర్విల్ పటేల్ సంచలనం సృష్టించాడు. లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో కేవలం 13 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి, అత్యంత వేగవంతమైన ఐపీఎల్ ఫిఫ్టీ రికార్డును సమం చేశాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్‌తో స్టేడియంలోని అభిమానులను ఉర్రూతలూగించాడు.

ఈ మ్యాచ్‌లో ఉర్విల్ మొత్తం 23 బంతులు ఎదుర్కొని 8 సిక్సర్లు, 2 ఫోర్ల సహాయంతో 282.6 స్ట్రైక్ రేటుతో 65 పరుగులు చేశాడు. గతంలో 2023 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 13 బంతుల్లోనే ఈ ఘనత సాధించగా, ఇప్పుడు ఉర్విల్ పటేల్ ఆ రికార్డును అందుకున్నాడు. అంతేకాకుండా, సీఎస్కే తరఫున అత్యంత వేగంగా హాఫ్ సెంచరీ చేసిన బ్యాటర్‌గా కూడా సరికొత్త చరిత్ర సృష్టించాడు.

సంజూ శాంసన్ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన ఉర్విల్, ఆరంభం నుంచే లక్నో బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అవేష్ ఖాన్ వేసిన ఓవర్లో మూడు సిక్సర్లు, ఆ తర్వాత దిగ్వేశ్ రాఠీ బౌలింగ్‌లో మూడు సిక్సర్లు, ఒక ఫోర్ బాదాడు. ముఖ్యంగా, ఐపీఎల్ చరిత్రలో ఇన్నింగ్స్ ఆడిన తొలి 8 బంతుల్లోనే ఆరు సిక్సర్లు బాదిన ఏకైక బ్యాటర్‌గా నిలిచాడు.

హాఫ్ సెంచరీ పూర్తి కాగానే ఉర్విల్ తన పాకెట్ నుంచి ఒక చిన్న నోట్‌ను తీసి "ఇది నీకోసం నాన్న" (This is for you, Dad) అని రాసి ఉన్న కాగితాన్ని ప్రదర్శించి తన ఇన్నింగ్స్‌ను తండ్రికి అంకితమిచ్చాడు. ఆ సమయంలో స్టేడియం మొత్తం "ఉర్విల్, ఉర్విల్" నినాదాలతో మార్మోగింది. ఉర్విల్ ఇన్నింగ్స్ సాయంతో పవర్‌ప్లేలో సీఎస్కే 97/1 స్కోరు చేసి, చెపాక్‌లో అత్యధిక పవర్‌ప్లే స్కోరు రికార్డును కూడా నెలకొల్పింది. చివరకు షాబాజ్ అహ్మద్ బౌలింగ్‌లో ఉర్విల్ ఔటైనప్పటికీ, సీఎస్కే భారీ స్కోరుకు పటిష్ఠమైన పునాది వేశాడు.



# ఆర్‌సీబీకి తలనొప్పిగా మారిన ఇద్దరు స్టార్ ప్లేయర్లు.. కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యం..!

**డిడి9 వార్త:**

ఎల్ 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) జట్టు వరుస పరాజయాలతో ఒత్తిడిలో పడింది. తాజాగా లక్నో సూపర్ జెయింట్స్ (LSG) చేతిలో 9 పరుగుల తేడాతో ఓటమి పాలైన ఆర్‌సీబీకి ఇది వరుసగా రెండో పరాజయం కావడం గమనార్హం. జట్టు మొత్తం బాగానే ఆడుతున్నప్పటికీ, ఇద్దరు కీలక ఆటగాళ్ల పేలవ ఫామ్ ఇప్పుడు జట్టుకు పెద్ద తలనొప్పిగా మారింది. వారు జితేష్ శర్మ, రొమారియో షెపర్డ్.





**జితేష్ శర్మ మరోసారి విఫలం**

లక్నోతో జరిగిన మ్యాచ్‌లో జితేష్ శర్మపై ఆర్‌సీబీ భారీ ఆశలు పెట్టుకుంది. మిడిల్ ఆర్డర్‌లో వేగంగా పరుగులు చేసి మ్యాచ్‌ను ముగిస్తాడని భావించిన జితేష్, మరోసారి నిరాశపరిచాడు. కేవలం ఒక పరుగు మాత్రమే చేసి పెవిలియన్ చేరడంతో జట్టు ఒత్తిడిలో పడింది. అయితే, ఆర్‌సీబీ యాజమాన్యం జితేష్‌ను భారీగా రూ.11 కోట్లకు రిటైన్ చేసుకుంది. కానీ, ఈ సీజన్‌లో అతని ప్రదర్శన మాత్రం ఆ అంచనాలకు ఏమాత్రం సరిపోలలేదు. ఇప్పటివరకు 10 మ్యాచ్‌ల్లో 8 ఇన్నింగ్స్‌లు ఆడి కేవలం 64 పరుగులు మాత్రమే చేశాడు. అతని స్ట్రైక్‌రేట్ కూడా 108.47గా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది మాత్రం జితేష్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. 15 మ్యాచ్‌ల్లో 261 పరుగులు చేసి 176.35 స్ట్రైక్‌రేట్‌తో మెరిశాడు. కానీ ఈసారి అతని ఫామ్‌లో స్పష్టమైన క్షీణత కనిపిస్తోంది.

**రొమారియో షెపర్డ్ కూడా ఫామ్‌లో లేడు**

మరోవైపు ఆల్‌రౌండర్ రొమారియో షెపర్డ్ కూడా ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు. లక్నోతో మ్యాచ్‌లో 15 బంతుల్లో 23 పరుగులతో నాటౌట్‌గా నిలిచినా, జట్టును గెలిపించలేకపోయాడు. విధ్వంసకర బ్యాటింగ్, డెత్ ఓవర్లలో వేగంగా పరుగులు చేసే సామర్థ్యం కారణంగా షెపర్డ్‌ను ఆర్‌సీబీ కీలక ఫినిషర్‌గా భావించింది. అతడిని రూ.1.50 కోట్లకు జట్టులో కొనసాగించింది. కానీ ఈ సీజన్‌లో అతను 10 మ్యాచ్‌ల్లో కేవలం 79 పరుగులు మాత్రమే చేశాడు. అతని స్ట్రైక్‌రేట్ 143.64గా ఉంది. బౌలింగ్‌లో కూడా ప్రభావం చూపలేకపోయాడు. 10 మ్యాచ్‌ల్లో కేవలం 5 వికెట్లు మాత్రమే తీసి, 12.94 ఎకానమీతో పరుగులు సమర్పించుకున్నాడు. ఒక ఆల్‌రౌండర్‌కు ఇవి సరైన గణాంకాలు కావని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**జట్టులో స్థానం కోల్పోయే ప్రమాదం**

వరుస వైఫల్యాల నేపథ్యంలో జితేష్ శర్మ, రొమారియో షెపర్డ్‌లపై విమర్శలు పెరుగుతున్నాయి. ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే ఆర్‌సీబీ వెంటనే మార్పులు చేయాల్సిన అవసరం ఉందని మాజీ క్రికెటర్లు సూచిస్తున్నారు. ఇద్దరు ఆటగాళ్లు త్వరగా ఫామ్‌లోకి రాకపోతే జట్టులో వారి స్థానాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఐపీఎల్‌లో వారి రికార్డులు**

జితేష్ శర్మ ఇప్పటివరకు 65 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడి 22.44 సగటుతో 1055 పరుగులు చేశాడు. అతని స్ట్రైక్‌రేట్ 152.89గా ఉంది. రొమారియో షెపర్డ్ మొత్తం 28 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడి 185.91 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేయడంతో పాటు కీలక వికెట్లు కూడా తీశాడు. అయినప్పటికీ ఈ సీజన్‌లో మాత్రం ఇద్దరూ తమ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేక ఆర్‌సీబీకి భారంగా మారారు.

# ఫస్ట్ బాల్‌కే సిక్స్.. 'సిక్సర్ల' సెంచరీతో వైభవ్ సూర్యవంశీ ప్రపంచ రికార్డు

- **40 లోపు బంతుల్లో రెండు ఐపీఎల్ సెంచరీల రికార్డు వైభవ్ పేరు మీదే**
- **ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ సాధించిన ఆటగాడిగా వైభవ్**
- **నిన్నటి మ్యాచ్‌లో తొలి బంతికే సిక్స్ కొట్టిన వైభవ్**
- **514 బంతుల్లో సిక్సర్ల సెంచరీ సాధించిన వైభవ్ సూర్యవంశీ**

**డిడి9 వార్త:**

వైభవ్ సూర్యవంశీ రికార్డులను తిరగరాస్తున్నాడు. ఇప్పటికే ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ సాధించిన ఆటగాడిగా నిలిచాడు. 40 లోపు బంతుల్లోనే రెండు ఐపీఎల్ సెంచరీలు (ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్‌పై 35 బంతుల్లో, ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 36 బంతుల్లో) సాధించిన ఏకైక బ్యాటర్ కూడా. శనివారం, సూర్యవంశీ మరో ప్రపంచ రికార్డును నమోదు చేశాడు. మహమ్మద్ సిరాజ్ బౌలింగ్‌లో తొలి బంతికే సిక్సర్ కొట్టి, టీ20లలో అత్యంత వేగంగా 100 సిక్సర్లు కొట్టిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు బద్దలు కొట్టాడు.

15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కేవలం 514 బంతుల్లోనే సిక్సర్ల 'సెంచరీ' మైలురాయిని చేరుకున్నాడు. ఈ మైలురాయిని చేరుకున్న అత్యంత పిన్న వయస్కుడైన ఆటగాడు కూడా ఇతనే కావడం గమనార్హం.

నిన్న గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో సూర్యవంశీ 16 బంతుల్లో 36 పరుగులు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో మూడు సిక్సర్లు, మూడు ఫోర్లు ఉన్నాయి. అతని మూడు సిక్సర్లూ పవర్‌ప్లేలోనే వచ్చాయి. ఒక ఐపీఎల్ సీజన్‌లో పవర్‌ప్లేలో అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డు కూడా ఇప్పుడు సూర్యవంశీ పేరిట నమోదైంది.



**ఒక ఐపీఎల్ సీజన్‌లో పవర్‌ప్లేలో (1-6 ఓవర్లు) అత్యధిక సిక్సర్లు**

30 వైభవ్ సూర్యవంశీ (2026)
29 అభిషేక్ శర్మ (2024)
27 అభిషేక్ శర్మ (2026)
22 సనత్ జయసూర్య (2008)
22 ట్రావిస్ హెడ్ (2024)
22 యశస్వి జైస్వాల్ (2025)

వైభవ్ సూర్యవంశీ 30 సిక్సులతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత స్థానాల్లో అభిషేక్ శర్మ, సనత్ జయసూర్య, ట్రావిష్ హెడ్, యశస్వి జైశ్వాల్ ఉన్నారు.

# 2026 ప్లేఆఫ్స్ రేసు.. ఎస్‌ఆర్‌హెచ్, ఆర్సీబీ పక్కా.. ఈ మ్యాచ్ గెలిస్తే ఆ జట్టుకు టైటిల్ ఖాయమన్న అశ్విన్

**డిడి9 వార్త:**

ఐపీఎల్ 2026 సీజన్ దాదాపు క్లైమాక్స్ దశకు చేరుకుంది. గ్రూప్ స్టేజ్ ముగియడానికి చాలా జట్లకు కేవలం నాలుగైదు మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. పాయింట్ల పట్టికలో కొన్ని జట్లు ఆధిక్యంలో ఉన్నప్పటికీ, అధికారికంగా ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకున్న జట్టు మాత్రం ఇప్పటివరకు ఏదీ లేదు. ప్రస్తుతం 14 పాయింట్లతో సన్‌రైజర్స్ హైదరాబాద్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆ తర్వాతి స్థానాల్లో పంజాబ్ కింగ్స్ (13 పాయింట్లు), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్ (12 పాయింట్లు) ఉన్నాయి. ఇక చెన్నై సూపర్ కింగ్స్ 10 పాయింట్లతో ఉండగా.. కోల్‌కతా నైట్ రైడర్స్ (9), ఢిల్లీ క్యాపిటల్స్ (8), ముంబై ఇండియన్స్ (6), లక్నో సూపర్ జెయింట్స్ (6) వెనుకంజలో ఉన్నాయి.




ఈ నేపథ్యంలో ప్లేఆఫ్స్ సమీకరణాలపై భారత మాజీ స్పిన్ దిగ్గజం రవిచంద్రన్ అశ్విన్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. ఎస్‌ఆర్‌హెచ్, ఆర్సీబీ జట్లు దాదాపు ప్లేఆఫ్స్‌కు చేరుకున్నట్లేనని ధీమా వ్యక్తం చేశాడు. “SRH, RCB కచ్చితంగా క్వాలిఫై అవుతాయి. మిగిలిన రెండు స్థానాల కోసం గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్ మధ్య గట్టి పోటీ ఉండబోతోంది” అని అశ్విన్ విశ్లేషించాడు. ఐపీఎల్‌లో తన ప్రస్థానాన్ని సీఎస్‌కేతో మొదలుపెట్టి, తన చివరి సీజన్‌ను కూడా అదే జట్టుతో ముగించిన అశ్విన్.. చెన్నై అవకాశాలపై కీలక వ్యాఖ్యలు చేశాడు. “చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్‌కు వెళ్లాలంటే మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఖచ్చితంగా గెలవాలి. అదృష్టం మీద ఆధారపడటం పనికిరాదు. ఒకవేళ చెన్నై 16 పాయింట్లతో నిలిచినా.. రాజస్థాన్ తన మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడింటిని ఓడిపోవాలి, అలాగే పంజాబ్ పాయింట్లు కోల్పోవాలి. దీనికి తోడు చెన్నై నెట్ రన్ రేట్ మెరుగ్గా ఉండటం కీలకం” అని అశ్విన్ వివరించాడు. నెట్ రన్ రేట్ ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ.. “చెన్నై తన తర్వాతి రెండు మ్యాచ్‌లను లక్నో సూపర్ జెయింట్స్‌పై గెలిస్తే, వారు కేవలం ప్లేఆఫ్స్ చేరడమే కాదు, 2010లో లాగా ఏకంగా టైటిల్ గెలిచే అవకాశం సైతం ఉంది. ఇకపై జరిగే ప్రతి మ్యాచ్ ఒక బ్లాక్ బస్టర్ లాంటిదే” అని అశ్విన్ వివరించాడు.